తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 85 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం30 -10-2024 వెల: 5/రూ -



# మూసీపై తగ్గేదేలే!

## పునరుజ్జీవంపై వెనకడుగు వేయబోం.. నవంబర్ 1న పనులకు శంకుస్థాపన చేస్తా

- ప్రాజెక్టు కోసం పైసా కూడా ఖర్చు పెట్టం
- నిధులన్నీ ప్రైవేటు సంస్థల నుంచే సేకరణ
- బాపూఘాట్‌లో ఎత్తయిన గాంధీ విగ్రహం
- అవసరమైతే మూసీ వెంట పాదయాత్ర
- హైడ్రాతో రియల్ ఎస్టేట్ పడిపోలేదు

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నవంబర్ 1న మూసీ పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తిచేశామని రుణమాఫీ కింద దాదాపు రూ. 18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొన్ని ఆగిపోయి ఉండొచ్చని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా పూర్తయినట్టు తెలిపారు. కొరియా పర్యటనకు వెళ్లి వచ్చిన జర్నలిస్టులతో మంగళవారం సచివాలయంలో రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు.

2లో



## మీకు సేవ చేయలేకపోతున్నా..

# క్షమించండి

- పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోని వృద్ధులకు మోదీ క్షమాపణలు
- 'ఆయుష్మాన్ భారత్'లో రెండు రాష్ట్రాలు చేరకపోవడంపై ఆగ్రహం
- 'ఆయుష్మాన్ భారత్- ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన'కు శ్రీకారం

2లో

# 'తల్లిదండ్రులకు పిల్లలంతా సమానమే!

## ఒక బిడ్డ మరో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం.

## అవన్నీ కుటుంబ ఆస్తులే.. షర్మిలకూ ఇవ్వాలి

## గిఫ్టుగా కాదు.. అది జగన్ బాధ్యత.. విజయలక్ష్మి బహిరంగ లేఖ

- వైవీ, సాయిరెడ్డి అబద్ధాలు చెబుతున్నారు
- షర్మిలకు ఇప్పటిదాకా ఆస్తులు పంచివ్వలేదు
- వైఎస్ ఉండగా కొన్ని ఆస్తులు ఇద్దరి పేరిట పెట్టాం
- విడిపోదామని 2019లో జగనే చెప్పారు
- ఎంవోయూ కూడా రాసిచ్చారు
- తక్షణం ఇస్తామన్నవీ ఇప్పటికీ ఇవ్వలేదు
- వ్యాపారాల్లోకి షర్మిలను రానివ్వలేదు
- బహిరంగ లేఖలో విజయలక్ష్మి వినతి

అమరావతి: 'తల్లిదండ్రులకు పిల్లలంతా సమానమే! కానీ... ఒక బిడ్డ మరో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం.





## మళ్లీ తెరపైకి ఈ-కార్ రేస్ వ్యవహారం..

# ఏసీబీకి ఫిర్యాదు

హైదారబాద్, ఫార్ములా ఈ-కార్ రేస్ నిధుల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేటాయింపులపై మున్సిపల్ శాఖ అధికారులు తాజాగా ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఫార్ములా ఈ-రేస్ కేసు నిధుల బదలాయింపుపై విచారణ జరపాలని మున్సిపల్ శాఖ అధికారులు ఏసీబీని కోరారు. దీంతో విచారణ అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది. రూ.కోట్లల్లో నిధులు బదిలీ కావటంపై మున్సిపల్ శాఖ విచారణ కోరింది. నిబంధనలు పాటించకుండా ఎంఏయూడీ నిర్వహణ సంస్థ ఎఫ్ఈఓకు రూ. 55కోట్లు చెల్లించింది. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు పాటించకపోవడంతో ఫార్ములా ఈ-రేసింగ్ సిసన్-10 రద్దైన విషయం తెలిసిందే. బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండానే రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు చెల్లించారు.

2లో

# ఐక్యంగా పోరాడండి

- వైఎస్సార్‌సీపీ నాయకులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు
- కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి
- ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్ ఘాట్‌లో జగన్ నివాళి
- జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశం

కడప: 'వైఎస్సార్‌సీపీ నాయకులు ఐక్యంగా పోరాటం చేయాలి. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి...' అని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మంగళవారం హెలికాప్టర్‌లో



2లో

# చెన్నపట్నలో గెలిస్తే డీకేనే సీఎం!

- కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ 'కౌన్ బనేగా సీఎం' చర్చ
- కుర్చీలాటలో కీలకంగా మారిన ఉప ఎన్నిక
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్
- గెలిస్తే సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పీఠానికి ఎసరు?

బెంగళూరు, అక్టోబర్ 29: కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై కుర్చీలాట మొదలయ్యింది. ఉప ముఖ్యమంత్రి, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసేలా అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన వర్గీయులు, ఒక్కలిగ సామాజకవర్గ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం వచ్చే నెల 13న జరగనున్న చెన్నపట్న అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. కుమారస్వామి రాజీనామాతో





# కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

## తొక్కిసలాట.. 150 మందికి గాయాలు

# ఫ్రస్టేషన్‌లో ప్రభుత్వం..

## వైఫల్యాలను ఎత్తి చూపినందుకే :కేటీఆర్



# ఫ్రస్టేషన్‌లో ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ : ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకే సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై ఫ్రస్టేషన్,డేస్పరేషన్‌లో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు.అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్ మాపై చేస్తున్న రాజకీయ వేధింపుల ప్రహసనంలో గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలన్నీ ప్రారంభం మాత్రమే. రానున్న రోజుల్లో మరిన్ని వేధింపులు ఉంటాయి. మద్దతుగా నిలిచిన పార్టీ శ్రేణులకు, సోషల్ మీడియా వారియర్లకి ధన్యవాదాలు. ప్రభుత్వం చేసే వ్యక్తిగత దాడులను, కుట్రలను, కుతంత్రాలను, అబద్దాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందాం.కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా డిఫ్ ఫేక్ టెక్నాలజీ వంటి అనేక అంశాల సహకారంతో వారి పెయిడ్ ఆర్టిస్ట్‌లతో చేసే దుర్మార్గపూరిత కుట్రలు చూడాల్సి వస్తుంది. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ వారి పెయిడ్ సోషల్ మీడియా అంతా కలిసి బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయబోతున్నాయి. ఇలాంటి కుటిల ప్రయత్నాలతో అయోమయానికి గురి కావడం, ఆగం కావొద్దు. ప్రజా సమస్యలపైనే మన పోరాటం. తెలంగాణ ప్రజల కోసం చేస్తున్న మన పోరాటం పైనే దృష్టి సారిద్దాం. కాంగ్రెస్ పార్టీ అవినీతిని, అసమర్థతను, హిపోక్రసీని ఎత్తిచూపుదాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకై వారిపైన ఒత్తిడి తెద్దాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# మీకు సేవ చేయలేకపోతున్నా.. క్షమించండి

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ప్రభుత్వాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేయడం లేదని, అక్కడి ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతుండడమే ఇందుకు కారణమని మండిపడ్డారు. ఆ రెండు రాష్ట్రాల్లో వృద్ధులకు ఉచితంగా వైద్యం లభించకపోవడం చూసి చాలా బాధపడుతున్నానని చెప్పారు. వారికి సేవ చేసే అదృష్టం రాకపోవడం పట్ల చింతిస్తున్నానని తెలిపారు. ఆ వృద్ధులను క్షమాపణ కోరుతున్నానని పేర్కొన్నారు.దఆయుష్మాన్ భారత్‌ను మరింత విస్తరింపజేస్తూ 70 ఏళ్లు దాటిన వారందరికీ ఈ పథకం వర్తించేలా ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(ఏబీ%-%పీఎంజేఏవై)ను మోదీ మంగళవారం శ్రీకారం చుట్టారు. తొమ్మిదో ఆయు ర్వేద దినోత్సవం, ధన్వంతరి జన్మదినోత్సవం సందర్భంగా వైద్య రంగానికి సంబంధించి రూ.12,850 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. 70 ఏళ్లు దాటిన వారిని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం పరిధిలోకి తీసుకొస్తానని సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ఈరోజు నెరవేరుస్తున్నానని తెలిపారు.ఏబీ%-%పీఎంజేఏవైతో 4 కోట్ల మంది లబ్ధి పొందుతారని వెల్లడించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

**ఐదేళ్లలో మరో 75,000 ఎంబీబీఎస్, ఎండీ సీట్లు**

“70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ వయ వందన కార్డులు అందజేస్తాం. వీటితో ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14,000కుపైగా ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో 80 శాతం డిస్కౌంట్‌తో ఔషధాలు లభిస్తున్నాయి. ఈ కేంద్రాలతో పేదలు, మధ్యతరగతికి రూ.30,000 కోట్ల మేర లబ్ధి కలిగింది. స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్ల వంటి పరికరాల ధరలు తగ్గించడంతో సామాన్య ప్రజలకు రూ.80,000 కోట్లు ఆదా అయ్యాయి. దేశంలో గత పదేళ్లలో దాదాపు లక్ష ఎంబీబీఎస్, ఎండీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే ఐదేళ్లలో మరో 75,000 సీట్లు రాబోతున్నాయి. వైద్య విద్య నిరుపేదలకు సైతం సులభంగా అందుబాటులోకి రావాలన్నదే మా లక్ష్యం” అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు.

**రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి నియామక పత్రాలు**

దేశంలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించేలా, వారి ఆకాంక్షలు నెరవేరేలా ఒక పటిష్టమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. గరిష్ఠ సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మంగళవారం 'రోజ్‌గార్ మేళా'లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 51,000 మందికి వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేశారు. అంతరిక్షం, సెమీకండక్టర్ల వంటి ఆధునిక రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దాంతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్‌తేరాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అయోధ్యలోని భవ్యమందిరంలో బాలరాముడిని ప్రతిష్టించుకున్న తర్వాత వచ్చిన ఈ తొలి దీపావళి పండుగ మనకు చాలా ప్రత్యేకమని చెప్పారు.

# ఐక్యంగా పోరాడండి

(మొదటి పేజీ తరువాయి)

ఇడుపులపాయకు చేరుకున్న ఆయన నేరుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌కు వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె స్యుదీర్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ భరోసా కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆదేశించారు.కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, గంగుల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌బీ అంజాద్‌బాషా, రాచమల్లు శివప్రసాదరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు. అనంతరం పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్ పార్టీ నాయకులతో మమేకమయ్యారు.బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఆయా ప్రాంతాల నాయకులతోను వివిధ అంశాలపై చర్చించారు. కాగా, పులివెందులలో దారిపొడవునా తన కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తూ... ఆగి పలకరిస్తూ... వారి వినతులు స్వీకరిస్తూ... వైఎస్ జగన్ భాకరాపురంలో ఉన్న తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల రూ.530 కోట్లతో నిర్మించారు. 605 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తిచేశారు.

# 'తల్లిదండ్రులకు పిల్లలంతా సమానమే!

(మొదటి పేజీ తరువాయి)



అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడటం తల్లిగా నా విధి. నా ధర్మం'... అని వైఎస్ జగన్మోహన్ రెడ్డి, షర్మిల తల్లి విజయలక్ష్మి పేర్కొన్నారు. అన్నా చెల్లెలి మధ్య కొన్నేళ్లుగా అంతర్గతంగా, కొన్నాళ్లుగా బహిరంగంగా సాగుతున్న వివాదంపై తల్లి విజయలక్ష్మి తొలిసారిగా తన భావాలను అందరితో పంచుకున్నారు. 'వైఎస్ రాజశేఖర రెడ్డిని అభిమానించే వారికి...' అంటూ మంగళవారం 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. తమ కుటుంబ ఆస్తులకు సంబంధించి వైఎస్ అంతరంగం, ఆదేశాలతోపాటు తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. షర్మిలకు జగన్ అన్యాయం చేస్తున్నారని స్పష్టం చేశారు. జగన్ తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఆడిటర్‌గా విజయసాయి రెడ్డి, ఇంటి బంధువుగా వైవీ సుబ్బారెడ్డికి అన్నీ తెలిసీ ఇలా మాట్లాడటం బాధాకరమన్నారు. 'ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు' అని హెచ్చరించారు. ఇప్పటికీ తాను స్పందించకపోతే ఈ వివాదం, అసత్యాల పరంపర కొనసాగుతుందని... అందుకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

తమ తండ్రి వైఎస్ జీవించి ఉండగా ఉన్న కుటుంబ ఆస్తులన్నింటినీ సమానంగా పంచాలన్నది ఆయన ఆదేశమని షర్మిల పేర్కొంటుండగా... 'ఆ ఆస్తుల్లో నీకు హక్కులేదు. కేవలం ప్రేమాభిమానాలతో కొంత వాటా ఇద్దామనుకున్నా. ఇప్పుడు అది కూడా ఇవ్వను' అని జగన్ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. పైగా... ఆస్తుల పంపిణీపై గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేసేది లేదంటూ ఏకంగా తల్లీ చెల్లిపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్టీ)లో కేసు కూడా వేశారు. జగన్ లేఖ... దానికి ప్రతిగా షర్మిల లేఖాస్త్రం... కేసులతో కుటుంబ వివాదం రచ్చకెక్కింది. ఇదే నేపథ్యంలో మంగళవారం విజయలక్ష్మి ఆవేదన, ఆక్రోశంతో బహిరంగ లేఖ రాశారు. 'ఇదీ నిజం' అంటూ జగన్ వైఖరిని ఎండగట్టారు.

**ఆస్తులు పంచలేదు... ఇస్తామన్నదీ ఇవ్వలేదు**

'2019 వరకూ కలిసే ఉన్నాం. కుటుంబ ఆస్తుల్లో షర్మిలకూ సమాన వాటా ఉంది' అని విజయలక్ష్మి స్పష్టం చేశారు. షర్మిలను కుటుంబ వ్యాపారాల్లోకి రానివ్వలేదని... అయినప్పటికీ జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడిందని, ఆయన అధికారంలోకి రావడంలో షర్మిల కృషి ఎంతో ఉందన్నారు. అదే సమయంలో... ఆస్తులను పెంచడంలో జగన్ కష్టం ఉందన్నదీ నిజమేనన్నారు. 'అవన్నీ కుటుంబ ఆస్తులు అన్నది నిజం. బాధ్యతగల కుమారుడిగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం” అని తెలిపారు. వైఎస్ జీవించి ఉండగానే షర్మిలకు ఇప్పటికే ఆస్తులు పంచేశారంటూ వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. “పిల్లలు పెరుగుతున్న రోజుల్లో కొన్ని ఆస్తులు షర్మిల పేరిట, కొన్ని జగన్ పేరిట పెట్టారు. అది... ఆస్తుల పంపకం కానేకాదు” అని స్పష్టం చేశారు. ఆ ఆస్తులను పంచుకుందామనుకుంటున్న సమయంలో వైఎస్ దుర్మరణం పాలయ్యారని తెలిపారు. 2019లో సీఎం అయిన రెండు నెలలకు ఆస్తులు పంచేసుకుందామని జగనే ప్రతిపాదించారని చెప్పారు. “విజయవాడలో నా సమక్షంలోనే ఎవరికి ఏ ఆస్తులు అని ఎంవోయూ రాసుకున్నారు. షర్మిలకు హక్కు ఉంది కాబట్టే రూ.200 కోట్లు డివిడెండ్ ఇచ్చాడు. హక్కు ఉంది కాబట్టే అధికారికంగా ఎంవోయూ రాశారు. ఇవేవీ షర్మిలకు జగన్ గిఫ్టుగా ఇస్తున్నవి కావు. బాధ్యతగా ఇవ్వాల్సినవి” అని స్పష్టం చేశారు. కేసులు, ఈడీ కేసులు, జప్తుతో సంబంధం లేని సరస్వతి పవర్ వాటాలు 100 శాతం, ఎంవోయూలో లేని ఎలహంక ప్రాపర్టీ వందశాతం షర్మిలకు ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి, సంతకం చేశారన్నారు. అవి కూడా ఇప్పటికీ ఇవ్వలేదని ఆక్రోశించారు.

# మూసీపై తగ్గేదేలే!

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అడ్డుకున్నా మూసీ విషయంలో తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోమని, మూసీ కోసం భూములిచ్చే వారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తామని వివరించారు. బాపూ ఘాట్ నుంచే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

**రూపాయి కూడా ఖర్చు చేయం**

మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపినట్టు తెలిపారు. ఈ చర్చ కారణంగానే మూసీపై ప్రజలకు అవగాహన కలిగిందన్నారు. మూసీ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తొలి దశలో బాపూ ఘాట్ నుంచి గండిపేట, హిమాయత్‌సాగర్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల్లో డిజైన్లు పూర్తవుతాయని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి రూ. 7 వేల కోట్లతో నీటిని ఉస్మాన్‌సాగర్‌కు మళ్లిస్తామని, అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు పంపుతామని తెలిపారు.ట్రంక్‌లైన్ కోసం వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. ప్రతిపక్షాలు రూ.1.5 లక్షల కోట్లు అని విమర్శలు చేస్తున్నాయి కానీ, ప్రభుత్వ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయబోమని, పూర్తి నిధులను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం నుంచే సేకరిస్తామని చెప్పారు. బాపూ ఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, అక్కడే బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం ఆర్మీ భూమిని కూడా అడిగినట్టు తెలిపారు.15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు పిలుస్తామని, మూసీ వెంట అంతర్జాతీయ యూనివర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రిక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. మూసీని మరొక సిటీగా అభివృద్ధి చేస్తామని, రూ. 141కోట్లతో డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. మూడు నెలల్లోనే నివేదిక వస్తుందని తెలిపారు. మూసీని ఎకో ఫ్రెండ్లీ, వెజిటేరియన్ కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేస్తామని వివరించారు. మూసీ వెంట రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మార్కెట్ ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిపారు. మూసీకి ఎలాంటి ఫైనాన్షియల్ మోడల్ వాడాలో డీపీఆర్‌లో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేటీఆర్ నుంచి సలహాలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రతిపాదనలు తెలపాలని కోరారు. సమయం వచ్చినప్పుడు మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తానని, అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తానని తెలిపారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదని, దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

కాసర్‌గడ్(కేరళ): కేరళలోని ఓ ఆలయంలో జరిగిన తెయ్యం(కాళియాట్టం) ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాణసంచా హఠాత్తుగా పేలడంతో తొక్కిసలాట జరిగి సుమారు 154 మంది గాయపడ్డారు. వీళ్లలో 10 మంది తీవ్రమైన కాలిన గాయాలతో బాధపడుతున్నారు. తెయ్యం లేదా కాళియాట్టం అనేది ఉత్తర కేరళ ప్రాంతంలోని ఆలయాల్లో నిర్వహించే పురాతన కళా ప్రదర్శన. అయితే, కాసర్‌గడ్ జిల్లాలోని నీలేశ్వరం పట్టణ సమీపంలోని వీరర్కవు దేవాలయంలో సోమవారం రాత్రి తెయ్యం ఉత్సవం జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలోని ఓ రేకుల షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా ఆ షెడ్డులో పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో జనం ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది.

# చెన్నపట్నలో గెలిస్తే డీకేనే సీఎం!



ఖాళీ అయిన చెన్నపట్న నియోజకవర్గం డీకే శివకుమార్ సొంత జిల్లా అయిన రామనగరలో ఉంది. 2009 నుంచి కాంగ్రెస్ ఇక్కడ ఒక్కసారీ గెలవలేదు. జేడీఎస్‌కు, దేవెగౌడ కుటుంబానికి ఇది పట్టున్న ప్రాంతం. ఉప ఎన్నికలో జేడీఎస్ తరఫున, బీజేపీ మద్దతుతో కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీ చేస్తున్నారు. దీంతో ఈ ఉప ఎన్నిక కర్ణాటక రాజకీయాల్లో కీలకంగా మారింది. ఐదుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన సీపీ యోగేశ్వరను కాంగ్రెస్ బరిలో నిలిపింది. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సీఎం పదవికి చేరువ కావొచ్చని డీకే శివకుమార్ భావిస్తున్నారు. అందుకే 'నేను అభ్యర్థిని అనుకొని ఓటు వేయండి' అంటూ ఆయన చెన్నపట్న ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

**డీకే గెలిస్తే సిద్ధూకు చిక్కులే**

డీకే వర్గీయులు కూడా చెన్నపట్నలో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. 'ఈ ఎన్నిక డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యేలా చేస్తుంది. ఉప ఎన్నిక ఫలితం డీకే శివకుమార్ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది.' అంటూ డీకే వర్గీయుడు, ఎమ్మెల్యే శివలింగె గౌడ ప్రచారం చేస్తున్నారు.

# న్యాయం కోసం నిరసన తెలుపుతున్న ఎఈఓలు



**మహబూబాబాద్,అక్టోబర్ (డైలీ రిపోర్ట్):** రైతు నేస్తం ప్రోగ్రాంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల వ్యవసాయ విస్తరణాధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి రైతు వేదికలో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎఈఓలు మాట్లాడుతూ గత నెల రోజులుగా వ్యవసాయ విస్తరణాధికారులు డిజిటల్ క్రాప్ సర్వేపై అభ్యంతరాలు తెలిపినందుకు గాను 12 రాష్ట్రాలలో అమలుచేస్తున్న విధంగా మన రాష్ట%శీ%లో కూడ అమలు చేయాలని కోరుతున్నందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులు గత మంగళవారం నాడు అకారణంగా రాష్ట్ర వ్యాప్తంగా, అలాగే మహబూబాబాద్ జిల్లాలో ముగ్గురు మా తోటి ఎఈఓలను సస్పెండ్ చేయడం జరిగింది. అందుకు నిరసిస్తూ ఎఈఓల సమస్యల సాధన అడ్ హాక్ కమిటీ ఉన్నతాధికారులతో జరిపిన చర్చలలో భాగంగా తోటి ఏఈఓ మిత్రుల సస్పెన్షన్ వెంటనే రివోక్ చేసి డిజిటల్ క్రాప్ సర్వే పై సోమవారం రోజున చర్చలకు పిలుస్తామని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మాట ఇచ్చి.... సస్పెన్షన్లను ఎత్తివేయకపోగా, మళ్లీ అదే కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని,ఇకనైనా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి,వెంటనే డిజిటల్ క్రాప్ సర్వేను అన్యాయంగా ఎఈఓలపై రుద్దాలానే ఆలోచనలను మానుకొని, ఇప్పటికే అధిక పని భారంతో సతమతమవుతున్న ఏఈఓల యొక్క క్షేత్ర స్థాయి సమస్యలపై భరోసా కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ,గంగారం మండల వ్యవసాయ విస్తరణాధికారులు, జిల్లా జాక్ అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు వినోద్ కుమార్,మునిప్రసాద్,యశ్వంత్, అరవింద్,ధరనేష్ లు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం పట్టివేత

**మహబూబాబాద్ జిల్లా:** గంగారం మండలంలోని మడగూడెం నుంచి సోమ వారం రాత్రి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గ్రామస్థులు గంగారం సెంటర్లో పట్టుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.లక్ష వరకు ఉండొ చ్చని అంచనా. పందెం గ్రామానికి చెందిన ఓ..ఆటోడ్రైవర్ గిరిజనుల నుంచి తక్కువరేటుకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇల్లందు రైస్ మిల్లర్లకు రూ.30 వరకు విక్రయి స్తున్నట్టు సమాచారం. వాహనంతో పాటు డ్రైవర్ వివరాలను స్థానిక ఎస్ఐ సేకరించినట్లు తెలిసింది.

## దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీ పరిశీలకునిగా డా. జి.శ్యామ్ కుమార్



**పిఠాపురం, అక్టోబర్ 29 (డైలీ రిపోర్ట్) :** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు) ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఈనెల 30వ తేదీ నుండి నవంబర్ 3వ తేదీ వరకు జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీ (మెన్)లకు పరిశీలకునిగా యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా. జి.శ్యామ్ కుమార్ ను నియమిస్తూ న్యూఢిల్లీలోని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు) ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.మురళీకృష్ణ మంగళవారం విసి ఛాంబర్ నందు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కెవిఎస్ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరగనున్న సౌత్ జోన్ యూనివర్శిటీ కబడ్డీ గేమ్స్ విజయవంతంగా నిర్వహించి జెఎన్టియుకె యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డా. జి.శ్యామ్ కుమార్ ను ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.మురళీకృష్ణతో పాటు రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్, ఓఎస్డి ప్రొ.డి. కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు అభినందించారు.



## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి... భర్తకు గాయాలు..

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి.. స్థానికుల వివరాల ప్రకారం. ఇచ్చోడ మండలం కోకాస్ మనూర్ గ్రామానికి చెందిన మధుకర్. రమ్యకృష్ణ దంపతులు ఆదిలాబాద్ కు వెళుతుండగా. గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది 108 లో రిమ్స్ కు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే రమ్యకృష్ణ మృతి చెందినట్లు వెల్లడించారు



## అడుగంటిపోతున్న భూగర్భ జలాలను అరికట్టడం ఇంకుడుగుంతల వల్లే సాధ్యం

### మహబూబాబాద్ జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి వేముల సురేష్





మహబూబాబాద్,అక్టోబర్ (డైలీ రిపోర్ట్): భూగర్భ జలాల నియంత్రణ పెంపు పై మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా భూగర్భ జలాల శాఖ అధికారి వేముల సురేష్ పాల్గొని మాట్లాడుతూ నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా భూగర్భ జలాలు శాఖ, షేర్ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో వర్షపు నీరును ఎలా నిల్వా చేయాలి, ఇండ్లలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పరిశ్రమల్లో, ఇంకుడుగుంత లు నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రతీ ఒక్కరికీ బాధ్యతయుతంగా వ్యవహరించాలని, చెక్ డ్యాంల నిర్మాణం, వర్షపు నీటి ప్రవాహం కట్టల నిర్మాణం, చెయ్యాలని, చెట్లు నాటడం ద్వారా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందనీ, నీరు ను వృదా చేయకుండా అందరికీ చైతన్యం కల్పించడానికి క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పరిరక్షణ కు సంబంధించి వ్యాసరచన పోటీలు, సైన్స్ ఫెయిర్స్, తదితర పోటీ కార్యక్రమాలు, నిర్వహించడం జరిగిందని ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రజిత, సాంబయ్య, సుధాకర్, కృష్ణమోహన్, సుబ్బారావు వనిత, హార్టికల్చర్, వ్యవసాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనికి రాకున్నా వచ్చినట్టుగా రికార్డులు.. డబ్బులు డ్రా

### 24 గ్రామపంచాయతీలో 1780195 రూపాయలు రికవరీ

### రికవరీ లేనిపక్షములో విధుల నుండి తొలగింపు

### మహబూబాబాద్ జిల్లా అడిషనల్ డిఆర్డిఏ శాంత కుమారి ఆదేశాలు జారీ



**మహబూబాబాద్/కొత్తగూడ, అక్టోబర్ 29(డైలీ రిపోర్ట్):** కొత్తగూడ మండలంలో ఉన్న 24 గ్రామ పంచాయతీలలో 2022-2023 సంవత్సరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీల్లో అధికారులు తప్పు తడాకనా నమోదు చేశారు. గ్రామ పంచాయితీల వారీగా తనిఖీలు నిర్వహించగా సుమారు 1780195 రూపాయలు అవినీతి జరిగిందని వాటిని రికవర్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామపంచాయతీల వారీగా ముస్మి 75075 రూ., పెగడపల్లి 159353 రూ., కార్లయి. 57282రూ.,గోవిందపురం 28215 రూ.,ఓటాయి 11263 రూ., మొండ్రాయి గూడెం 32168 రూ., దుర్గారం 18488 రూ., ఎదుళ్లపల్లి 140852 రూ., ఎంచగూడెం 69704 రూ.,రామన్నగూడెం తండా 11637 రూ., బత్తులపల్లి 7275 రూ.,తాటి వారి వేంపల్లి 177106 రూ.,గుంజేడు 28158 రూ.,సాదిరెడ్డిపల్లి 6742 రూ., చెరువుముందు తండా 20279 రూ.,రేన్య తండా 65955 రూ., కోనాపురం 50282 రూ., వేలుబెల్లి 297212 రూ., గోపాలపురం 47056 రూ., జంగవాని గూడెం 11965 రూ.,పోగుల్లపల్లి 12449 రూ.,కొత్తపల్లి 155123 రూ., గుండం 17514 రూ.,కొత్తగూడ 289042రూ. అవినీతి జరిగిందని సామాజిక తనిఖీలలో అధికారులు వెల్లడించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయాల్సి వస్తుందని,సామాజిక తనిఖీల్లో ఆయా గ్రామపంచాయితీ కార్యదర్శి, టిఏ, ఎఫ్ఏల వద్ద నుండి రికవరీ చేయాలని డిఆర్డిఏ శాంత కుమారి ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లో చెట్లను నాటి,మాస్టర్ ల పై సంతకాలు ఉండాలని, డబుల్ పేమెంట్ లు రికవరీ చేయని పక్షంలో విధులు నుండి తొలగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎపిడిపిడి మధుసూదన్ రావు, జిల్లా అంబుర్స్ మెన్ బి. ఆదాము, ఎస్ఆర్పి కొమురయ్య, పంచాయతి, కార్యదర్శులు ఉపాధి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసిన శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్

**శంకర్‌పల్లి: అక్టోబర్ 29: (డైలీ రిపోర్ట్):** రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా నారాయణరెడ్డి మంగళవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కలెక్టర్ నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించినట్టు కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

## రాష్టపతి అవార్డు గ్రహీతను సన్మానించిన సేవా ఫౌండేషన్

శంకర్‌పల్లి: అక్టోబర్ 29: (డైలీ రిపోర్ట్): మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అనేక అవార్డులు పొంది, రాష్ట్రపతి అవార్డు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తాండూర్ వాసి గాజుల బస్వరాజుని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ కార్యాలయంలో సభ్యులు, కండక్టర్ ఇందూర్ రాజుతో కలిసి సన్మానం చేశారు. అనంతరం శ్రీ మరకత శివలింగ సోమేశ్వర స్వామి చందిప్ప మరకత శివాలయంను రాష్ట్రపతి అవార్డు గ్రహీత సందర్శించడం జరిగింది.



# తపాలా శాఖలో విజయవంతంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు




**సంగారెడ్డి , అక్టోబర్ 29(డైలీ రిపోర్ట్):** ఈనెల 28వ తేదీ నుండి నవంబర్ 3 వ తేదీ వరకు సంగారెడ్డి పోస్టల్ డివిజన్ పరిధిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పి ఎల్ వి మురళి కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన డివిజన్ ఆఫీస్ లో నిర్వహించిన కార్యక్రమంలో దేశం యొక్క శ్రేయస్సు సమగ్రత సంస్కృతి కోసం పాటుపడతామని తపాలా ఉద్యోగులు మూకుమ్మడిగా సమగ్రతా ప్రతిజ్ఞ చేశారు. పాలన ప్రభుత్వ పరిపాలనలో సమగ్రత, పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడానికి విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు. అలాగే సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడంతో కొందరు విద్యావంతులు అమాయకులు మోసపోతున్నారని ఈ విషయంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సంగారెడ్డి బ్రాంచ్ మేనేజర్ లు వెంకట్ రావు, కవిత సంయుక్తంగా మాట్లాడుతూ నీతి మరియు సుపరిపాలనను ప్రోత్సహించడంలో ప్రతి ఒక్కరి భాధ్యత ఉండాలన్నారు. అవినీతిని నిర్మూలించడంలో పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజం, సుపరిపాలన, పారదర్శకత మరియు జవాబుదారీతనం, పౌరుల భాగస్వామ్యం పట్ల ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు కల్పించినట్లు వీటిని వినియోగించుకోవాలని జహీరాబాద్ పోస్టల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ పేర్కొన్నారు.సమగ్రతను, పారదర్శకతను ప్రోత్సహిద్దాం అని నొక్కి చెప్పారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ వారోత్సవాలలో భాగంగా పసలవాడి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్మాస్టర్ సురేష్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ గౌడ్, సిపిసి ఇంచార్జ్ వనజ, అకౌంటెంట్ నాగరాజు, శ్రావణి, డివిజన్ స్టాఫ్ మహేందర్, శ్రీనివాస్, శివ, రమేష్, హెడ్ పోస్ట్ మ్యాన్ రామారావు, పోస్ట్ మ్యాన్ లు విష్ణు, కుశలయ్య, ఏం టి ఎస్ లు భవాని, బానోత్ మురళి, సందీప్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ సచిన్, పసల్ వాడి గ్రామ సెక్రెటరీ, పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో

# ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సమీక్ష ఏర్పాటు





**ఎల్ బి నగర్ అక్టోబర్ 29 (డైలీ రిపోర్ట్):** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని జీ.ఓ.118 సంబంధించిన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ 118 జీ.ఓ.విషయంలో ఎవరు ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, చిట్టచివరి కన్వియన్స్ డీడ్ ఇచ్చేవరకు మీతోనే ఉండి మీతో కలిసి పోరాటం చేస్తా అని అన్నారు.అలాగే ఇట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడ్డాక ఉద్దేశపూర్వకంగా ఇట్టి జీ.వో 118 ని ఆపడం జరిగింది అని తెలిపారు. దాదాపు పది నెలల నుంచి ఎందుకు జీ . వో 118 కింద దరఖాస్తు చేసుకున్న గృహనిర్మాణ దారులకు కన్వినియన్స్ డీడ్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. నామమాత్రపు 250/-రుసుముతో 118 జీ.ఓ.తీసుకొస్తే 90శాతం ప్రజలు దరఖాస్తు చేసుకోవడం జరిగింది అని తెలిపారు.దాదాపు 80% కన్వియన్స్ డీడ్ లు గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఇవ్వడం జరిగింది అని గుర్తు చేశారు.అలాగే అప్పుడే ఎన్నికల కోడ్ రావడం వల్ల 118 జీ.ఓ.అమలు ఆగిపోవడం జరిగింది అని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇట్టి జీ.ఓ.ను ఎందుకు ఆపడం జరిగింది అని సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. కుట్రపూరితంగా ఇట్టి జీ.ఓ.ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టడం జరిగింది అని అన్నారు. తక్షణమే ఇట్టి 118 జీ.ఓ.అమలును పునరుద్ధరణ చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క గృహనిర్మాణ దారులందరికి కన్వియన్స్ డీడ్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు .ఇట్టి జీ.ఓ.పూర్తిగా కొనసాగిస్తే ప్రజలందరికి లబ్దిచేకూరి సుధీర్ రెడ్డి కి పేరు ప్రఖ్యాతులు వస్తాయనే దురుద్ధేశంతోనే ఇట్టి జీ.ఓ.ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపడం జరిగింది, ఇది ప్రజలందరూ గ్రహించాలి, అలాగే నిజంగా ఇట్టి ప్రభుత్వానికి ప్రజల మీద చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రజోపకరమైన ఇట్టి జీ.ఓ.ను వెంటనే అమలుచేసి దీనికి సంబంధించిన కాలనీ వాసులను కష్ట నష్టాల నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. అలాగే మిగిలిపోయిన వారికి స్థానిక ఏం.ఆర్.ఓ.ఆఫీస్ నందు పెండింగ్ లో ఉంచిన కన్వియన్స్ డీడ్లు మరియు అలాగే 500 రూపాయల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కన్వియన్స్ డీడ్ లు ఇప్పించాలని డిమాండ్ చేశారు.అలాగే నేను రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి అని చెప్పుకొని తిరిగిన మధుయాష్కీ పదకొండు నెలల నుంచి ప్రజల సౌకర్యం కోసం తెచ్చిన జీ.ఓ.ను ఎందుకు ఆపడం జరిగింది అని ప్రశ్నించారు.దీనివెనుక ఎవరు ఉన్నారన్న విషయం ప్రజలకు త్వరలోనే భాహిర్గతం చేస్తానని హెచ్చరించారు .ఇట్టి కార్యక్రమంలో బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి , బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని జీ.ఓ.118 భాధిత కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు దండు పుల్లారెడ్డి,పొగుల రాంబాబు,పురుషోత్తం రెడ్డి, సుధాకర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ముత్యంరావు,రవీందర్ రెడ్డి,కృష్ణరెడ్డి, గుజ్జ జగన్ మోహన్ రెడ్డి , సోమి రెడ్డి, ధనరాజ్ , అంజిరెడ్డి గార్లు మరియు పార్టీ సీనియర్ నాయకులు సుమన్ గౌడ్, గంగం శివశంకర్, మనోజ్ గౌరీ శెట్టి ,కాజా శ్రీనివాస్, నీళ్ల రాజశేఖర్,పంది కృష్ణా , లక్ష్మీపతి , శేఖర్ , రవి,శ్రీకాంత్ రెడ్డి,తదితర నాయకులు పాల్గొన్నారు.

## 'వారి పేర్లు డైరీలో రాసి పెట్టుకుంటున్నాం'

మహబూబ్‌నగర్: హామీలు నెరవేర్చే వరకు సీఎం రేవంత్‌ను వదిలిపెట్టం అంటూ మాజీ మంత్రి హరీష్‌రావు హెచ్చరించారు. రాష్ట్రంలో కొత్త పథకాలు అటుంచి పాత పథకాలను మూలకేశాడంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని.. కొర్రీలు పెట్టి రుణమాఫీకి ఎగనామం పెడుతున్నారంటూ ధ్వజమెత్తారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టిన పాలకుడు ఇచ్చిన మాట తప్పితే రాష్ట్రానికే అరిష్టం అంటూ వ్యాఖ్యానించారు. "ఎనముల రేవంత్ కాదు.. ఎగవేతల రేవంత్. ఢిల్లీకి మూటలు పంపేందుకు.. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులిచ్చే సీఎంకు రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు నిధులు లేవా? రైతుబంధు ఇవ్వని కాంగ్రెస్‌ను ఉరికించాలి. పత్తి రైతులకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారు. డెడ్ లైన్లు మారాయి.. పత్రికల్లో హెడ్ లైన్లు మారాయి.. కాని రైతు రుణమాఫీ మాత్రం ఓ లైన్‌కు రాలేదు" అంటూ హరీష్‌రావు చురకలు అంటించారు. "సర్కార్ దవాఖానాల్లో మందులు కూడా లేవు. 29 జీవోతో నిరుపేద నిరుద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుంది. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు. పోలీసు పాలన సాగుతోంది. సీఎంకు పాలన మీద పట్టు లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కరెంట్ బిల్లులు పెరగలేదు. వచ్చే అసెంబ్లీలో ప్రభుత్వం మెడలు వంచుతాం. అక్రమ కేసులు పెడుతూ.. కొందరు పోలీసులు అతిగా



వ్యవహరిస్తున్నారు. వారి పేర్లు డైరీల్లో రాసిపెడుతున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి" అంటూ హరీష్‌రావు పిలుపునిచ్చారు.





## శంకర్‌పల్లి లో జిఎం విజేత సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: అక్టోబర్ 29: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి చేవెళ్ల రోడ్డులో సోమవారం జిఎం విజేత సూపర్ మార్కెట్ ను స్థానిక ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యలు కలిసి రిబ్బన్ కట్ చేసి లంచనంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలు సూపర్ మార్కెట్ ను వినియోగించుకోవాలని కోరారు. సూపర్ మార్కెట్ కు వచ్చే కస్టమర్లకు సరసమైన ధరలకు వస్తువులను అమ్మాలని సూచించారు. సూపర్ మార్కెట్ యాజమానులు గోవింద్ రెడ్డి, చంద్రయ్య, సుధాకర్ రెడ్డి, మల్ రెడ్డి లను ఎంపీ, ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. షాపు యజమానులు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. షాపు యజమానులు మాట్లాడుతూ పట్టణ మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సూపర్ మార్కెట్ ను ప్రారంభించామని, పేద, మధ్యతరగతి వారికి అన్ని రకాల కిరాణా, జనరల్ వస్తువులు దొరుకుతాయని పేర్కొన్నారు. సూపర్ మార్కెట్ లో రూ. 5000 వస్తువులు కొనుగోలు చేసినచో స్కూటీ కూపన్, రూ. 2500 వస్తువులు కొనుగోలు చేసినచో రిఫ్రిజిరేటర్ కూపన్లు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం, మండల, మున్సిపల్ బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఈఆర్సీ తిరస్కరించడం బీఆర్ఎస్ విజయమే

### ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపగలిగాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించడం బీఆర్ఎస్ సాధించిన విజయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపగలిగినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్ మంగళవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఈఆర్సీ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.పది సంవత్సరాల్లో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచని బీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా, కేవలం 10 నెలల్లోనే రూ.18,500 కోట్ల విద్యు త్ చార్జీల పెంపు ప్రతి పాదనలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిందని విమర్శించారు. అయితే ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్సీని ఒప్పించగలిగినట్టు తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు స్వయంగా తనతోపాటు విద్యుత్ శాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి , ఇతర సీనియర్ నాయకులు రాష్ట్ర ఈఆర్సీని కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొని ప్రజల తరఫున వాదనలు వినిపించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యా లను, అవినీతిని ఎత్తి చూపినందుకు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌పైన ఫ్రస్టేషన్, డెస్పరేషన్‌లో ఉన్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ తమపై చేస్తున్న రాజకీయ వేధింపుల ప్రహసనంలో గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలన్నీ ప్రారంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో మరిన్ని వేధింపులు ఉంటా యని, కాంగ్రెస్ పార్టీ చేసే వ్యక్తిగత దాడులు, కుట్రలు, ప్రాపగండా, అబద్ధాలను ఎదుర్కొ నేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707